# లంచం సరదా ::

రచయిత :
శ్రీ రాపాక సుందరశివరావు

ఆరోజు సంవత్సరాదికి వ్యవధి 24 గంటలు మాత్రమే. కమల ఆత్రుతగా లేచింది. వేణు ముందుగా కోడికూతవేళనుండి పేచీ మొదలుపెట్టాడు. వాడి అల్లరి అణచటం నాతరంగాదు. అందువల్ల నేను లేవడం అనవుసరమని, లేచుటకు ప్రయత్నముచేసి లేస్తే వేణుగాడి డ్యూటీ మనపైనిపడుతుందనే అభిప్రాయముతో అతి సీరియస్‌గా పడుకోటం తటస్థించింది. అంటే, నేనాసమయంలో సెమికాన్సస్ స్టేజిలో ఉన్నానన్నమాట. కమల చదువుకున్నందుకు ఫలితం ఏమిటంటే నాకంగారుతత్వానికి బద్ధకానికి దివ్యౌషధము కనిపెట్టింది. అనుక్షణం ఆఫీసు గొడవలవల్ల మానసికంగా బాధపడేనన్ను సంతోషపెట్టడం తెలుసు. అవసరమని తోచినపుడు బాధపెట్టడంకూడ ఆమెకు కొత్తగాదు. గడియారం 7 గంటలు కొట్టింది. ఆ గడియారంవైపు తీక్షణంగా చూసింది.

"ఏమండీ"...

...............

"ఎంత బద్ధకమండీ! లేద్దురు బాబూ."

..................

"ఏడుగంటలయింది. కాఫీ చల్లపడితే సహించదు మీకు! తిరిగి కాస్తే ఆరోగ్యభంగము. కోడి కూసినపుడు లేచి యింటిచాకిరీఅంతాచేసి కాఫీకాస్తే త్రాగేందుకు దయరాలేదు పాపం!"

"ఏడికావుపోదూ! రాత్రి పక్కచేరేసరికి 2 గంటలువేసింది, కోడికూసేటప్పటికి మనం లేవాలేమిటి! భగవంతుడు వాటిని మంచి పులావులను తయారుచేసుకోవటానికి సృష్టించాడు. అంత తొందరేమిటి. నీపని నువ్వు చూసుకుందు బాబూ!" అని ప్రక్కకుదొర్లి పడుకున్నాను.

"ఇదెక్కడి ఉద్యోగమండీ! దొరగారు వస్తున్నారని కబురువచ్చినా లేవకపోతే..." అని కమల అనడంతోనే ప్రపంచములోపడి కంగారుగా బ్రంట్రోతు ఏడీ! అని అడిగేటప్పటికి కాఫీకి వెళ్ళివస్తానని వెళ్ళాడు అని సమాధానం చెప్పింది. నాకంగారు అర్థంచేసుకున్న కమల వేపపుల్ల చేతికి అందించింది. నేనీ ఉద్యోగంలో ప్రవేశించాక ఏదోఒక ఆఫీసరు ప్రతివారం రావటం, వారికొరకు కంగారుపడటం క్రొత్తవిషయాలుకావు. పందుమప్రడక నోట్లో నానుతునే ఉంది. నీళ్ళచెంబు ఎప్పటివలెనే పెట్టిఉంది. కాఫీ విషయంకు నాఊహాప్రపంచంలో తావులేదు.

"ఎందుకు ఇంకా అట్లాగే కూర్చునిపోయారు! వారు ఈపాటికివచ్చేవుంటారు! కబురు మళ్ళీవచ్చిందంటే కాఫీమానేసి పరుగెత్తుతారు." అనేటప్పటికి నా ఆలోచనలు ఉదయభానునిముందు మంచులా మాయమై "అబ్బే! ఈరోజు యిక్కడకు వస్తారనికాదూ చెప్పావు. మకాంవేస్తారేమో! ఏర్పాటులను గురించి కొంచెము ఆలోచిస్తున్నాను" అనేటప్పటికి "అంతేనా! ఈబాధలు మీకు నాకు కూడ క్రొత్తవికావు. ఈభయమే మనలను యింతవరకు చేసింది." అంటూ ఆ కాఫీకప్పు అందించింది.

"స్నానాలగదిలో నీళ్ళు సిద్ధంగాయున్నాయి. స్నానంచేసి మరీవెళ్ళండి. వాడు మిమ్ములను బయలుదేరడానికి సిద్ధంఅయి ఉండమని చెప్పివెళ్ళాడు. అనేటప్పటికి ఏదోఉందని గుండెలో రాయిపడింది. స్నానంచేసి సిద్ధంగా ఉండేటప్పటికి నా జమాను వచ్చేడు. అతికంగారుగాలేచి 'దొరగారు వచ్చారా!' అనిప్రశ్నవేసేటప్పటికి "లేదు బాబుగారూ! ఎవ్వరునురాలేదు! ప్రొద్దున్నవచ్చేటప్పటికి అమ్మగారు బజారుకు వెళ్లిరమ్మన్నారు."

"ఎందుకు."

"మారాడికొట్టు తెరిచారోలేదో చూచిరమ్మన్నారు. ఇంకా తెరవలేదు." అంటూ తెల్లబోయాడు.

# అజంతా చిత్రాలు!



ఆనాడు యేనాడో వ్రాసిన అజంతా చిత్రాలలోని స్త్రీలు అందగత్తెలు. ఆ అందచందాలు ఆకళా కోమలత్వాలు యీనాటి మహిళా మండలిలో అరుదు. మాతృత్వానికి అర్హత నిచ్చే పరిపూర్ణారోగ్యం ఈనాటి స్త్రీలలో లోపించింది. విడువకుండా "అరుణ" వాడితే ప్రత్యేకంగా స్త్రీలకు యేర్పడే గర్భ సంబంధమయిన రుగ్మతలు అన్నీ తప్పకుండా అంతరిస్తవి. పరిపూర్ణారోగ్యం లభ్యమాతుంది.

అరుణ

ఋతు సంబంధ దోషాలను అద్భుతంగా నివారించి, ప్రతి స్త్రీకి మాతృత్వ గౌరవాన్ని కలిగించగల ఉత్తమ రసాయనం.

(అన్ని మందుల షాపులలోనూ దొరకును)

ఆయుర్వేదాశ్రమము లిమిటెడ్,
79, గోపతి నారాయణచెట్టి రోడ్,
త్యాగరాయనగర్. : : మద్రాసు.


"అరే! మోసపోయ్యాను. నిద్రబద్ధకం యింకా వదలనేలేదు. ఏమిటీ పాడుపనులు కమలా! దీనికి శిక్ష ఒక్క ము..." అని పరుపుమీదవాలిపోయ్యేటప్పటికి "మళ్ళీపడుకోవాలనా మీ ప్రయత్నం. ఇప్పుడు మీకిచ్చింది లంచము గాని, శిక్షకాదు. కంగారు పడకండి. మరిచారుకాబోలు పాపం! రేపు సంవత్సరాది. నాకు క్రొత్తకోక, అచ్చిగాడికి సూటు, ..." అని చెప్తూంటే చాలాకోపంవచ్చింది.

"మీరు అల్లాఅంటేఎల్లాగా! ప్రతినెల అడుగుతున్నానా! మీరు తెచ్చియిస్తున్నారా?

"నీవు అల్లాఅంటేఎల్లాగా! ప్రతినెల మనకు వచ్చేజీతం నీచీరకు సరిపోతుందా! మీ నాన్నకు నీవు ఒక్కర్తివే! నీకే కొరతపడితే..."

వాళ్లు యివ్వరనికాదు. అది ఒకసరదా! మీబోటి చదువుకున్నవాళ్లు ఉద్యోగంలో ప్రవేశించాకకూడ వాళ్లదగ్గరనుండి కోరడం గౌరవమని అనుకోను. మనకాళ్లమీద మనమే నిలబడాలి."

"నిజమే, మనంమోయుగలబరువు మన బుజాలపైన వేసుకుంటే మనం మనకాళ్లమీద నిలుచోగలం కాని, లేనియెడల ఆ బరువుక్రిందబడి నలిగి నల్లేరుగా..."

"పోనీలెండి. నాకు సిగ్గులేదు. ఒక్కపండుగకు మిమ్మల్ని చీరఅడిగితే బరువని, బండిక్రిందపడిన నల్లేరని అంటున్నారు. మిమ్ములను అడగకఅడిగితే యింతబరువయింది. మా పుట్టింటికి నన్ను పంపెయ్యండి. వాళ్లకి నేనంత భారమువను. మీరు నా భారంలేకుండా పండుగ గడిపేయవచ్చు" అంటూ రివ్వనలేచి వెళ్లిపోయింది. చీరకొంగు దొరికింది. లాగి కూర్చోపెట్టాను.

"అనవుసరంగా కోపపడకు. నీకు యిన్నిబట్టలున్నాయి కదా! యింకెందుకుచెప్పు కమల! ఈ కంట్రోలురాజ్యం దశవర్షాలున్నను నీకు యిబ్బంది లేదు, తర్వాత నీకు కావలసినన్నిబట్టలు.

"చాల్లెద్దురూ! మీరల్లా అంటారుకాని మొన్న రామారావుగారి భార్య రత్నంకు అదొక్కమునుపే

నగలు చేయించారు ఆయన. చీరలు తెప్పించి యిచ్చారు. నిరుటి సంక్రాంతికి కొన్న జరీచీర, తమలపాకుల వెండిపళ్ళెము, వాళ్ల పాపలకి కాలరుఫ్రాకులు యిప్పటికింకా నాకు కళ్లకుకట్టినట్లున్నది. ఆవిడగారికి ఉన్న బట్టల్లో, వస్తువుల్లో నాకు నాల్గవవంతు లేవు. ఆయనకంటె మీకు జీతమధికం! మరిలాభంఏముంది. ఆవిడను నగలతోటి, చీరలతోటి ముంచేశారు. ఆవిడగారి పూర్వజన్మపుణ్యమేమిటో మరి! మీరు మాత్రము మాపుట్టింటివారు యిచ్చినది, మీ పుట్టింటి నుండి తెచ్చినది కరిగిస్తూ...''

అయితే అవి ఎల్లాగొచ్చేయో తెలుసా !''

''తెలియకేం! బాగా తెలుసు... నాకూ,మీకే కాదు...వూళ్ళోవాళ్లకి పైవాళ్ళకి అందరికి తెలుసు కదా !''

''తెలుసుకదా!'' పర్వలేదు. అవికాక ఇంకా ఏమైనా తెలుసునా నీకు !

''ఇంకా తెలుసు. మీరు, ఆ కృష్ణమూర్తిగారు ముక్కుమూసుకుని కూర్చున్నారని నవ్వుతున్నారు.'

''ఇంకా !''

''ఇంకా ఏముంది! మిమ్మలనుచూస్తే విచారమేస్తుంది. మాఅక్కయ్య అత్మమ్మగారిని చూస్తే జాలివేస్తుంది. స్నేహం ఊరికేపోదు. మేమిద్దరం ఒకత్రాసులో తులతూగుచున్నాము. నీటిప్రవాహాన్ని ఎదురుఈదడం.''

''మంచిమాటచెప్పావు. నీటిప్రవాహాన్ని నీవు ఎరుగవు. ప్రజలందరిచేత అధికారి అనేవాడు నిజముగా అధికారికాడు. ప్రజాసేవకుఁడు. జయచంద్రునినాడుపుట్టిన యీ లంచగొండితనము చీడపురుగులాగ విద్యాధికులను రూపుమాపింది. ఈరాజ్యములను తారుమారుచేసింది. అట్టి లంచములకు మానవమాత్రులు లొంగిపోయారంటే వింతఅయిన విషయం కాదు. తాత్కాలికంగా సుఖించినా తర్వాత ఆ ధనము ననుభవించిన వ్యక్తులు అష్టకష్టములుపడుట నిజము. ఎల్లకాలం ఒకేరీతిగా జరిగేటట్టు, మన వంశము వృద్ధిపొందేటట్టు చూడాలి. ఎంగిలికూటికి ఆశించేవాడు కుక్కకంటె హీనుఁడు. అది రాక్షసత్వము కాని మానవుఁడు చేయదగ్గపనికాదు, వాడు ప్రజలవల్ల పోషింపబడుతున్నాడన్నమాట మరచి, ప్రజల క్షేమంకొరకు చేయబడిన శాసనములను వాళ్లపై సవారీచేయుటకును, వారికి అసౌఖ్యమును కలిగించుటకు యుపయోగించిన ఎంత శోచనీయమో ఆలోచించు. ధనమున్న ప్రతివాడు, ధనవంతుడును, చదువుకున్న ప్రతివాడు, గుణవంతుడు అనునది పొరపాటు అభిప్రాయము.

''హా! హా! హా! మనకు చేతయినది వేదాంతము, కవిత్వము. కవికి శుక్రుడు ద్వితీయమందుండుటచేత అన్నవస్త్రము లుండవని మానాన్న చెప్పేవారు! మిమ్మలననేమిలాభము. జాతకం అల్లాంటిది అంటూ నిరుత్సాహంగా వెళ్ళింది. సాయంత్రం వచ్చింది. చీరలు వచ్చాయి. అబ్బ నూటువచ్చింది. ఆమె ముఖం వికసించింది. రాత్రి 12 గంటలు పన్నెండు సంవత్సరాలనిపించింది కమలకు.


కళాంజలి

[సచిత్ర మాసపత్రిక.]

సంవత్సర చందా రు. 8-0-0.

విడిపత్రిక అ. 0-4-0.

సంపాదకుడు : ''కాశీనాధ్''

- సెప్టెంబరు 1 వ తేదీన తొలి సంచిక వెలువడును.
- ఏజంట్లుగా చేరదలచేవారు వెంటనే దరఖాస్తులు పంపుమని కోరుచున్నాము.
- వ్యాసకర్తలు తమతమ రచనలను-ఆగస్టు 20 వ తేదీలోగా అందజేయవలెనని ప్రార్థన.
- కథలను, సినిమాకళ-వ్యాసాలను అతిత్వరలో ప్రకటిస్తుంది—కళాంజలి.
- ప్రకటనదారులు-తమతమ ప్రకటనలను విశదము వ్రాసిన-వివరములు వెంటనేపంపగలరు.

పబ్లిషర్ : ''కళాంజలి''

శోభనాద్రిపురం, మండవల్లి (P. O.)

క్రిష్ణాజిల్లా.

ఆమె చీర సింగారించింది. వేణుకు సూటు అలంకరించింది. నా పెండ్లినాటి ట్వీడ్ సూటును రెడీగా ఉంచింది. నాల్గుగంటలకు బీచికివెళ్ళి సినీమా చూసి యథావిధిగా, అతిసంతోషంగా సంవత్సరాది గడిపాము.

దోమ తెరలో అబ్బిగాడు నిద్రపోతున్నాడు. ఎవరో తలుపుకొట్టారు. నేను ఈజీ చైరులో కూర్చుని తమలపాకులు నములుతూ 'కథాంజలి' ని తిరగవేస్తున్నాను. "ఎవరువారు తలుపు తీయండి." అనికేక వినిపించటంతో నే కళ్లనులుపుకుంటూ "ఎవరో చెప్పకుండా తలుపు తీయడమేమిటి" అని వెళ్తుంటే నాకునవ్వొచ్చింది. కాని ఆపుకొని అతిసీరియస్‌గా కూర్చున్నాను. "పంతులుగారున్నారా" అని అడిగేటప్పటికి తల ఆడించి ఎవరో వచ్చినారని నాతో చెప్పి వంటయింటిలో సగం తలుపుమూసి నిల్చుంది.

"గుడ్ మార్నింగ్"! అన్నాడు శ్రీనివాసరావు.

"గుడ్ మార్నింగ్" మిష్టర్ రావు అనడంతో నే... సారీ, సర్. నాకు తడువులేదు. మిమ్మలను అరెష్టుచేయాల్సివచ్చింది!

"అరెష్టా! ఆశ్చర్యం! ఎందుకు"

"తెలియదా! మొన్న వందరూపాయిలు లంచము పుచ్చుకున్నారుట. మార్వాడి దగ్గర సాక్ష్యంతో రుజువయింది. మిగిలిన విషయం కోర్టులో సవిస్తరంగా చెప్తారు."

"సరే! మీ డ్యూటీ మీరు చెయ్యకతప్పదు. అవశ్యము అని లేచాను కమల కళ్ళంట నీళ్లురాలాయి, ప్రపంచములో ప్రళయం బయల్దేరినట్లుగా కనిపించింది. స్పృహతప్పి పడిపోయింది. మళ్ళీ తెలివి వచ్చి "అయ్యో! ఆయన ఏమీఎరుగడు! నేను ఆయన్ని ప్రేరేపించాను. నన్ను అరెష్టుచెయ్యండి. ఆయన్ను వదలండి నిర్దోషి" అంటూ కళ్లుమూసింది.

"అది కోర్టువారి పని, సమను జారి చేసి తీరాలి."

"ఏమిచేస్తే నన్ను మీరు స్వయముగా అరెష్టు చేస్తారు" అంటూ వెర్రిగా ఏడ్వడం ప్రారంభించింది. నేను శ్రీనివాసు వెత్తిగా నవ్వాము. "నేను శ్రీనివాసునిగాను! కృష్ణమూర్తిని" అంటూ నిజస్వరూపం చూపాడు. ఆరోజు కృష్ణమూర్తి కూడా అక్కడే భోజనం. పోష్టు బంట్రోతు కమలమ్మగారికి ఉత్తరం అంటూ నాచేతికి యిచ్చాడు. ఆ ఉత్తరం యిచ్చేటప్పటికి చించి ఈవిధముగా చదవడం ప్రారంభించింది.

ఏలూరు 15-6-46.

ప్రియమైన కమలకు,

నేడు మాకుపట్టిన దుర్గతి మూలమున మీ ముఖాలు చూడలేక ఈ విషయం వ్రాయవలసివచ్చినది. అక్కడ యున్నప్పుడు తిన్న లంచములకు చేసిన దుండగములకు మా ఆయనను ఉద్యోగమునుండి బర్తరఫు చేసేశారు. అక్కడ ఉన్నప్పుడు ఆయన కొన్న నగలు, చీరలు మీకు చూపించి మురిసేదాన్ని. ఆపాపిష్ఠి సొమ్ము యింతపని చేస్తుందని నేను అనుకోలేదు. బంగారమువంటి ఉద్యోగముపోయి, పండువంటి కాపురం పాడైపోయింది. ఆయనగారికి మతిస్థిమితములేదు. మేము వచ్చేటప్పుడు తీసుకున్న వందరూపాయిలు మొన్న పంపినాము. అందినట్లు వ్రాయవలెను.

దీనిలో ఒక విషయము చెప్పుటకు సంతసముగా యున్నది. మీ ఆయనకు ప్రమోషను యిచ్చినట్లును, కృష్ణమూర్తిగార్కి మేజిస్ట్రేటుగా ఏలూరు బదిలీ అయినట్లును యిచ్చట తెలిసినది. రేపు మీ ఆఫీసులో ఈ విషయమువస్తుంది, మీ సౌశీల్యము, మీ ఔదార్యము మిమ్మలను కాపాడును. మీకు మీ సంతానాలకు భగవంతుడు ఆయురారోగ్యైశ్వర్యములనిచ్చి కాపాడుగాత యని భగవంతుని ప్రార్థిస్తూయున్నాను. అత్తమ్మగారితో కూడ ఈ విషయములు చెప్పవద్దని తలుస్తాను. తమ క్షేమసమాచారములు ఈ నిర్భాగ్యురాలికి అప్పుడప్పుడు తెలియపరుస్తూ యుండవలెను. ఇట్లు మీ చెల్లి,

రత్నం.

Edited and Published by A. N. Raghavachar, No. 32, Krishnappa Naick Tank St. G. T. Madras.